సుమిత్ర చరిత్రము

గ్రంథకర్త:

కందుకూరి వీరేశలింగంపంతులు

ప్రకాశకులు:

హితకారిణీ సమాజము

రాజమహేంద్రవరము

1958

[వెల రు 0-6-0

సుమిత్ర చరిత్రము

గ్రంథకర్త:

కందుకూరి వీరేశలింగం పంతులు

ప్రకాశకులు:

హితకారిణీ సమాజము

రాజమహేంద్రవరము

1958

కాపీరైటు

ఈ నాటకమునందు వచ్చు పాత్రములు

సుమిత్రుడు—సింహళద్వీపపురాజు

చంద్రవర్మ—మలయాళదేశపురాజు

మంజువాణి—సుమిత్రునిరాణి

బహుమానుఁడు—సుమిత్రుని సభికులలో నొకఁడు

కృష్ణుఁడు—సుమిత్రుని పుత్రుఁడు

సత్యసారుఁడు—సుమిత్రుని పుత్రుఁడు

చతురాస్యుఁడు—సుమిత్రుని భృత్యులలో నొకఁడు

వక్రచిత్తుఁడు—సుమిత్రుని సభయందలి ప్రభువు

మిత్రవింద—వక్రచిత్తునిభార్య, మంజువాణిసఖి

మాలిని—మంజువాణిదాసి

రామవర్మ—చంద్రవర్మ కొమారుఁడు

ప్రమతి—సుమిత్రుని కొమార్తె

వీరుగాక గొల్లవాఁడు మొదలయిన మఱికొందరు వత్తురు.

సుమిత్ర చరిత్రము

పూర్వకాలమున సింహళద్వీపమును సుమిత్రుఁ డను రాజు పాలించుచుండెను. ఆయనకు రూపవతియు, గుణవతియు నగు మంజువాణి యను రాణి గలదు వా రిరువురును పరస్పరానురాగము గలవారయి, యపారమయిన సుఖము ననుభవించుచుండిరి. ఈ యుత్తమ నాయకామణితోఁడి ప్రణయము చేత, ఆతనికి బాల్యసఖుఁడును, సహపాఠియు నయిన చంద్రవర్మ యను మలయాళ దేశపు రాజును మరలఁజూచి యాతనికిఁ దన ప్రియభామినియొక్క సద్వర్తనమును జెప్పవలెనని యప్పుడప్పుడు పుట్టు అభిలాషతప్ప వేరుకోరిక యేమియు లేక యుండెను. సుమిత్రుఁడును చంద్రవర్మయు పిన్ననాఁటినుండియు నొక చోటనే యేకముగాఁ బెరిగిరి; కాని వారితండ్రుల మరణానంతరమునఁ దమతమ దేశముల నేలుట కయిఁ యెడఁబాయ వలసి వచ్చినందున, వారు తఱుచుగా బహుమానములను, ఉత్తర ప్రత్యుత్తరములను, ప్రియపూర్వకము లయిన క్షేమ వార్తలను బంపుకొనుచుండినను బహుసంవత్సరములనుండి యన్యోన్య ముఖావలోకనములు మాత్రము లేకయుండిరి.

ఇట్లు కొంతకాలము జరుగఁగా సుమిత్రుఁడు తన్నొకసారివచ్చి చూచి పొమ్మని మిత్రునకు మాటిమాటికి వర్తమా

నములు పంపుచు వచ్చినందున, మళయాళమునుండి బయలు దేఱి చంద్రవర్మయుఁ బరిమితపరివారముతో మిత్రసందర్శనార్థ మయి సింహళద్వీపమునకు వచ్చెను. ఈసమావేశమువలనఁ జిరకాల మెడఁబాసియుండి యాకస్మికముగాఁ గలిసిన యా మిత్రుల కిరువురకును గలిగిన యానంద మింతింత యని చెప్ప నలవి కాదు. రాకరాకవచ్చిన తన చిన్ననాఁటిమిత్రునకు సక లోపచారములను జేయుచుఁ జక్కఁగాఁ బరామర్శింప వలయు నని భార్యకు బోధించుటయే కాక, తన ప్రాణసమానుఁ డయిన బాల్యమిత్రుఁడు సరసనుండి చూచుచుండఁబట్టి యిప్పుడుకదా నాసౌఖ్యము పరిపూర్ణత గాంచె నని సుమిత్రుఁడు మనసులోఁ బరమానంద భరితుఁడయియుండెను. మిత్రు లిద్దఱును పూర్వ కాలమును గూర్చి ముచ్చటించుచు, బాల్యావస్థయందుఁ దాము చదువుకొన్న సంగతులను, చిన్ననాఁటి యాటపాటలను తోడిబాలురతోడఁ గూడి విహారమునకుఁ బోయినప్పుడు నడ చినచర్యలను దలఁచుకొని యానందించుచు, వారిసల్లాపముల యం దెల్లప్పుడును నుల్లాసమును గనఁబఱచుచు సమీపమున నుండు మంజువాణితో వేడుకగాఁ జెప్పుచుండిరి. ఇట్లు కొంత కాలము సుఖముగా జరిగినతరువాత చంద్రవర్మ తన దేశమునకు వెళ్ళుట కయి ప్రయాణము కాఁగా భర్త కోరిక ప్రకారము మఱికొంతకాలముండి వెళ్లు మని యాతనిని మంజువాణి ప్రార్థించి చెప్పెను.

ఈ యుత్తమ కాంతయొక్క సంతాపదినములు నాటితోఁ బ్రారంభ మాయెను. సుమిత్రుఁ డెంతప్రార్థించినను నిలువ నోడఁబడనివాఁడు మంజువాణియొక్క మృదుమధురవాక్యములచే మనసు కరఁగినవాఁడై దీనత్వముతో వేఁడికొనునామె ప్రార్థనను త్రోచిపుచ్చలేక చంద్రవర్మ మఱికొన్ని వారములవరకును తన ప్రయాణమును మానుకొనెను. తన మిత్రునియొక్క సుగుణసంపదయును తన యిల్లాలియొక్క సత్స్వభావమును జిరకాలానుభవమువలన లెస్సగాఁ దెలిసియున్నవాఁ డయ్యును, వేళావిశేషముచేత సుమిత్రుఁడు భార్యయందును మిత్రుని యందును నిగ్రహింపరాని యసూయ గలవాఁడయ్యెను. పెనిమిటియొక్క యాజ్ఞచేత నాతని ప్రీతిని బడయుటకొఱకే యాకాంత దినదినమును జంద్రవర్మ విషయ మయి చూపుచు వచ్చిన శ్రద్ధయంతయు దురదృష్టవంతుఁడైన యానృపాలుని యొక్క మనోవేదనాభివృద్ధికే తోడుపడసాగెను. సుమిత్రుఁడు పూర్వము ప్రియకాంతయెడ నెంతప్రేమగలవాఁడును ప్రియ మిత్రునియెడ నెంతదయ గలవాఁడు నయి యుండెనో యిప్పుడంతయీర్ష్యయు నిర్దయత్వమును గల ఘోరరాక్షసుడుగా మాఱి, తనసభికులలో నొకఁడగు బహుమానును బిలిపించి, రహస్యముగా నాతనితోఁ దనకుఁ గలిగిన యవమానమును జెప్పి, చంద్రవర్మను విషప్రయోగము చేసి చంపుమని యుత్తరువు చేసెను.

బహుమానుఁడు దూరాలోచనగలవాఁడును మిక్కిలి యోగ్యుఁడును కాఁబట్టి తనరాజు పెట్టుకొన్న సందేహమునకు లేశమయినను అవకాశము లేదని యెఱిఁగినవాఁడయి, విషము పెట్టుటకు మాఱుగాఁ దనప్రభువుయొక్క యాజ్ఞను ఆయనకు నివేదించి, సింహళద్వీపమునుండి తప్పించుకొని యాయనతోఁ గూడి వెడలిపోవుట కొప్పుకొనెను. చంద్రవర్మయు బహుమానునిసాయముచేతఁ దనరాష్ట్రములో సుఖముగాఁ బ్రవేశించెను. అప్పటినుండియు నక్కడ రాజసభలోఁ బ్రధానుఁడుగా నుండి, బహుమానుఁ డారాజునకు ముఖ్యమిత్రుఁడును అత్యంతప్రియుఁడును నయి యుండెను.

బహుమానుఁడు పాఱిపోవుటచేత మండిపడి, రాజు మఱింత కోపముతో రాణియున్న యంతఃపురమునకు తత్క్షణమే నడచి, అక్కడ తనముద్దులతనయుఁడైన కృష్ణుఁడు తల్లితో వేడుకగా నేదోకథ చెప్పుచుండఁగా వినుచుఁ గూర్చున్న భార్యను జూచి, కుమారుని రెక్కపట్టుకొని యావలకీడ్చి, భార్యను చెఱసాలయందుఁ బెట్టఁబంచెను. కృష్ణుడు మిక్కిలి పసివాఁ డయ్యును తల్లియందు మిగుల ప్రేమకలవాఁడయి యుండెను. కాఁబట్టి, తల్లిని ఆప్రకారముగా అవమానపఱిచి కారాగృహమునకుఁ బంపుచుండఁగా జూచినప్పుడు, గుండెలు పగిలిపోయి మనసులో దిగులు పెట్టుకొని, ఆహారనిద్రాదులు మాని దినదినక్రమమున క్షీణించి తుదకు మరణావస్థను బొందు

నంతటి స్థితిలోనికి వచ్చెను. రాజును తనరాణిని చెఱసాలకు పంపివేసి, చతురాస్యుఁడును సత్యసాహుఁడును అనునిద్దఱు భృత్యులను బిలిపించి, మీరు తిరువనందపురముననున్న దుర్గ గుడికిఁ బోయి మంజువాణికి నామీఁద మోహముకలదో లేదో, తెలిసికొని రండని పంపెను.

రాణి కొంచెముకాలము చెరసాలలో నున్నపిమ్మట, ఆమెకు కూఁతురు పుట్టెను. ముద్దులమూటగట్టు నాచిన్న కూఁతును జూచికొనుచుండుటవలనఁ గొంత యూరట చెంది ఆమె "నాకన్నతల్లీ! నీ వెంతనిర్దోషురాలవో నేను నంతి నిర్దోషురాలనేజుమీ" యని యాచిన్నదానిని జూచి పలికెను. ఆ పతివ్రతాతిలకమునకు రాజబంధుఁ డైన వక్రచిత్తునిభార్య మిత్రవింద యనునామె ప్రియసఖిగా నుండెను. ఆబిడ రాణికి కూఁతురు గలిగిన దన్నవార్తను విన్నతోడనే యామె యున్న చెఱసాలకుఁ బోయి, అక్కడ నామెకుపచారమునిమిత్తముంచఁ బడిన మాలిని యనుపరిచారికం గాంచి "మాలినీ! రాణిగారు నాయందు నమ్మిక ముంచి కొమార్తెను నావశమున నిత్తురేని, ఆచిన్నదానిని తండ్రియైన రాజుసన్నిధానమునకుం గొనిపోయి చూపెద నని నీవు వెళ్ళి యామెతోడ మనవి చేయుము. ఆ చిన్నదానిని చూచుటవలన నైన నాతనికి మనసు కరఁగి రాణిమీఁద దయవచ్చునేమో యెవ రెఱుఁగుదురు" అని చెప్పెను. మాలినియు మిత్రవిందను జూచి "తల్లీ! మీరు

సెల విచ్చినదాని నిప్పుడేపోయి రాణిగారితో విన్నవించెదను. ఆమె నేఁటియుదయకాలముననే యీపసిబిడ్డను గొనిపోయి రాజుపాదములమీఁదఁ బడవైవ సాహసించెడుపుణ్యాత్ము రా లెవ్వరైనదొరకునాయని విచారింపఁ జొచ్చినది." అని పలికెను. ఆమాటలకు సంతోషించి, "మాలినీ! రాజుగారిసమక్షమున నేను దనపక్షమున ధైర్యముతో వాదించెదనని రాణిగారితో జెప్పుము." అని మిత్రవింద చెప్పెను. నిరపరాధినియైన రాణి గారికి మహోపకారమును జేయఁబూనుకొన్న నీకు శాశ్వత సుఖము కలుగునుగాక యని మిత్రవిందను దీవించి, రాణి గారితో సర్వము విన్నపముచేసి యామెప్రీతిపూర్వకముగా నిచ్చినయాబాలికను పొత్తులలోఁ గొనివచ్చి, మాలిని యా పుణ్యవతియొక్క చేతిలోఁ బెట్టెను.

అప్పుడు పుట్టినయాపిల్లను పొత్తులలోఁ బెట్టుకొని నడచి, రాజు కోపమునకు భయపడి పోవలదని నిర్బంధించు నిజనాధుని వాక్యములనుసహితము లక్ష్యముచేయక, మూఁకలలోనుండి త్రోవచేసికొని రాజుసన్నిధికిఁ బోయి, మిత్రవింద యానెత్తురు గందును ఆయనపాదములమీఁదఁ బడవైచి, మోమోటమి లేక యావఱకు రాజుచేసిన క్రూరకృత్యమును గర్హించి, యేదోషము నెఱుఁగని పిల్లను తల్లిని దయతోఁ జూడుమని బహువిధముల వేఁడుకొని, జాలిపుట్టునట్టుగా రాణిపక్షముగాఁ గొంతతడవు ప్రసంగించెను. ఆమె న్యాయనిష్ఠురము లాడి

హితము చెప్పినకోలఁదిని రాజున కంతకంత కాగ్రహము బలిసి యామెను దన యెదురనుండి కొనిపొమ్మని యాపె పెనిమిటికో ను త్తరువుచేసెను. మిత్రవింద వెళ్లినపుడు పిల్లది యొంటిగా నున్నప్పుడు శిశువుయొక్క యసహాయతను జూచినన్నైన నొక వేళ జాలిపుట్టునేమో యని యాబిడ్డను తండ్రి కాళ్ళసమీపము ననే దిగవిడిచి పోయెను. ఆమెకోలుపుఁ బాసి వెళ్ళినతోడనే దయాశూన్యుఁ డయిన యాతండ్రి వక్రచిత్తుని బిలిచి "నీవీబిడ్డను గొనిపోయి సముద్రమునుదాటి నిర్జనవనములో దిగఁబెట్టి ర"మ్మని యాజ్ఞాపించెను.

వక్రచిత్తుఁడు ఉత్తమాంగనయైన మిత్రవిందవంటివాఁడు కానందున తనస్వామియాజ్ఞను శిరసావహించి యానిమిషము ననేయొకపడవనెక్కి, ముందుగా నెక్కడ నిర్మానుష్యమైనయడవి కనఁబడునో యక్కడనాచిన్నదానిని పాఱవేయవలెనను నుద్దేశముతో బయలుదేఱెను. రాజు రాణిమీఁద మహాకోపముతో నున్నవాఁడుకాఁబట్టి, దేవతావాక్యమును దెచ్చుటకయి వెళ్ళియుండిన సత్యసారుఁడును చతురాస్యుఁడును వచ్చుటకైనఁ గనిపెట్టుకొనియుండక, యీలోపుగానే కన్నకూఁతురు గతివిని మూర్ఛపోయి తేఱి కన్నకడుపు దహించుకొనిపోవ రాణి విలపించుచుండఁగా తనసభలోని ప్రముఖుల యొక్కయు మంత్రులయొక్కయు సమక్షమున బహిరంగముగా భార్యనేరమును విచారణ చేయుటకయి యామెను రప్పించెను. ఆమె చేసిననేరమును విమర్శించుటకయి దేశములోఁగల గొప్పవా

రును, న్యాయాధికారులును, మంత్రులును రావింపఁ బడిరి. అప్పుడు వారందఱి యెదుటను పీసమంతయు దోషములేని యా యోషిద్రత్నము మహాపరాధము చేసినదానివలె దీనత్వముతో నిలువఁబడి వారుచెప్పుతీర్పును వినుటకయి యెదురు చూచుచుండెను. ఇంతలో సత్యసారుఁడును చతురాస్యుఁడును సభామంటపము ప్రవేశించి, పదిలముగా ముద్రవేసి భద్రపఱిచి తెచ్చిన దేవతావాక్యములుగల యుత్తరమును సగౌరవముగా రాజునకు సమర్పించిరి. అప్పుడు రాజుయొక్క యాజ్ఞానుసారముగా సభికులలో నొకఁడు ముద్రను విడఁగొట్టి, అందులోని వాక్యము లందఱకు వినఁబడునట్లుగా నీప్రకారము చదివెను.— "మంజువాణి కేవలము నిరపరాధిని; చంద్రవర్మ కళంకరహితుడు; బహుమానుఁడే నిజమైన భృత్యుఁడు; సుమిత్రుఁడు నిష్కారణముగా జారత్వశంకను బెట్టుకొన్న క్రూరుఁడు; ఇప్పుడు చంపఁ బంపబడినకూఁతురు దొరకకపోయినయెడల రాజు సంతులేనివాఁ డయి మృతినొందును."—రాజు ఆమాటలయం దెంతమాత్రమును విశ్వాసముంచక, ఇదియంతయును రాణియొక్క మిత్రులచేత పన్నఁబడిన తంత్ర మని పలికి, న్యాయాధిపతి కభిముఖుఁ డయి నీవు రాణిని విమర్శించుట కారంభించు మని యాన తిచ్చెను. భూపతి యీమాటలు పలుకుచుండఁగానే, ఒకసేవకుఁడు కొలువుకూటమునకుఁ బరుగెత్తుకొనివచ్చి రాజుగారి పుత్రుఁడైన నకృష్ణుఁడు తనతల్లిని ప్రాణాంతశిక్షను పొందిం

చుట కయి విమర్శచేయుచున్నా రని విని వ్యసనము చేతను సిగ్గుచేతను దేహమ్మును మఱచి యాకస్మికముగ మృతినొందె నని చెప్పెను.

ప్రియనందనుఁడైనకృష్ణుఁడు తనకుసంభవించినదురవస్థ కేయికుంది ప్రాణములు విడిచినాఁడన్నవార్త చెవిసోఁకినతోడనే మంజువాణి మొదలునఱికినయరఁటిచెట్టువలె నేలమీఁదఁబడి మూర్ఛపోయెను. పుత్ర మరణవార్త రాజహృదయమునకు శూలమువలె నాటినందున, అభాగ్యురాలైన యిల్లాలియందుఁ గొంతకనికారము జనించి, రాజు తత్క్షణమే మిత్రవిందను ఆమె పరిచారికలను బిలిచి రాణిని ఆవలకుఁ దీసికొనిపోయి శైత్యోప చారములు చేసి మూర్ఛఁ దేర్చుఁడని యాజ్ఞాపించెను. రాణి నావలకుఁ గొనిపోయిన కొంతసేపటికి మిత్రవింద మరలఁ జను దెంచి, ఆమె మరణము నొందెనని చెప్పెను.

సుమిత్రుఁడు భార్య మరణము నొందెనని విన్నప్పుడు, ఆమె విషయమయి తానుచేసిన క్రూరకృత్యములను చింతించి పశ్చాత్తాపపడఁ జొచ్చెను. తానామెను పెట్టినబాధలవలననే యామెమనసు వికలత్వము నొందెననియు, ఆమె నిరపరాధిని యనియు నిప్పుడు తలఁచెను; ఉన్నయొక్క-కుమారుడుఁను మర ణము నొందినాఁడు. కాఁబట్టి చంపఁబడినకూఁతురు మరల దొరకనిపక్షమునఁ దాను సంతానము లేకుండ మృతినొంద వలసినది వాస్తవముగాఁ గనఁబడఁబట్టి యిప్పు డా దేవతా

వాక్యములయందును నమ్మకము తోఁచెను; కాఁబట్టి, తన పోయినకూఁతురునిమిత్తమయి తన రాజ్యమునైనను విడిచిపెట్ట వలెనని నిశ్చయించుకొని రాత్రిందివములు దుఃఖసముద్రములో మునిఁగియుండి, బహుసంవత్సరములు వ్యసనముతోను దీర్ఘ విచారముతోను రాజు కాలమును గడపుచుండెను.

వక్రచిత్తుఁడు రాజపుత్రిక నెక్కించుకొనిపోయినపడవ గాలివానవలనఁ గొట్టుకొనిపోయి, చంద్రవర్మ రాజ్యము చేయుచున్న మలయాళదేశతీరముననే చేరెను. వక్రచిత్తుఁడక్కడదిగఁ కావుకావున నేడ్చుచున్న యాపసిపిల్లను దయ మాలి యొకచోట విడిచిపెట్టి తనపడవపైపునకు వెళ్ళెను. కాని 'నీకూఁతు నచ్చట దిగవిడిచి వచ్చినా' నని సుమిత్రునితోఁ జెప్పుట కయి సింహళద్వీపమునకుమాత్ర మాతఁడు మరల రాలేదు. ఆతఁడు వెనుకఁదిరిగి తనపడవలోనికి వెళ్ళుటకయి పోవుచుండఁగా, చేరువయడవిలోనుండి యొకవ్యాఘ్రము వచ్చి యాతనిపయికి దూఁకి, మెడ పట్టుకొని చంపి తనప్రభువు యొక్క దుర్మార్గమయినయాజ్ఞను నెఱవేర్చినందునకై తగిన శిక్షను చేసిపోయెను. రాణి యాచిన్నదానిని రాజుకడకంపి నప్పుడు సాధ్యమయినంత యందముగాఁ గనఁబడునట్లు చేసి మఱి పంపినది. కాఁబట్టి, యిప్పు డాచిన్నది యమూల్యవస్త్ర ములతోను రత్నఖచితము లయిన స్వర్ణాభరణములతోను అలంకరింపఁబడి యుండెను. వక్రచిత్తుఁడును తాను బైలుదేఱి

వచ్చునప్పుడు ఒకకాగితముమీఁద 'ప్రమతి' యని వ్రాసి దాని నాచిన్నదానివస్త్రమున కంటించిపోయెను. ఆకాగితముమీఁదనే ఆమెది గొప్పవంశమనియు దైవవశమున దుర్దశప్రాప్తించిన దనియు సూచించుపదములుకూడఁ గొన్ని వ్రాయఁబడియుండెను గాని యవి స్పష్టముగాఁ దెలియఁదగినవిగా నుండలేదు.

మేకలను మేపుటకై యాయరణ్యమునకు వచ్చిన గొల్ల వాఁడొక్కఁడు ఆచిన్నదానియేడుపు విని దయార్ద్రహృదయుఁడై దాపునకు వచ్చి చూచి, పిల్లదాని నెత్తుకొని యింటికిబోయి పెంచుటకై తనభార్య కిచ్చెను. ఆగొల్లదియు పిల్లదానిని తన కుమార్తెలకన్నను ప్రేమతోఁ బెంచుచుండెను గాని, యాగోప కుటుంబమువారు తమయొక్క నిరుపేదతనమునుబట్టి సర్వాభర ణములతో నాచిన్నది తమకు దొరకినసంగతిని దాఁచవలసిన వారైరి. కాబట్టి ఆగొల్లవాఁడు తనభాగ్య మెక్కడనుండి వచ్చెనో యెవ్వరికిని తెలియకుండుట కయి కుటుంబముతోఁ గూడ తానుండుప్రదేశమును వదలివేసి, ఆ దేశమునకు రాజ ధానియైన యనంతసేనమునకు సమీపముననున్న పల్లె చేరి, ప్రమతియొక్క నగలలోఁ గొన్నిటిని విక్రయించి పసువులమంద లను గొని యచ్చట విశేషధనవంతుఁడుగా నుండెను. వాఁడు ప్రమతిని తనకూఁతునుగానే భావించుకొని పెంచుచుండెనే కాని, ఆమె రాచకూఁతురన్నమాటను లేశమైన నెఱిఁగినవాఁడు కాఁడు. ఆమెయు సంవత్సరక్రమమునఁ బెరిఁగి, యంతకంతకు

సౌందర్యవతియై యౌవనదశను పొందెను. ఆమె గొల్లపిల్లలు సాధారణముగా నేర్చుకొనుదానికంటె విశేషవిద్యను నేర్చుకొన్నది కాకపోయినను, ఆమెస్వభావసిద్ధములైన తెలివితేటలను నడవడికను జూచినవా రందఱును చిన్ననాఁటినుండియు నామె రాజమందిరములోఁ బెరిఁగినది కాదని యెంచుట కవకాశము లేనివారుగా నుండిరి.

మలయాళదేశపు రాజైన చంద్రవర్మకును రామవర్మ యను పేరుగల కొమారుఁ డొక్కఁడే యుండెను. అతఁ డొకనాఁడు వేటకుఁ బోయి ఆగొల్లవాని యింటిసమీపమునుండి వచ్చుచు గుమ్మములో నిలుచున్న ఆచిన్నదానిని జూచి ఆమె యొక్క రూపలావణ్యాదుల కద్భుతపడి, మోహపరవశుఁడయ్యెను. అతఁడు తత్క్షణమే మాఱువేషమును వేసికొని కందర్పుఁడను పేరున నాగోపగృహమునకుఁ బోయి నాఁడు మొదలుకొని తఱుచుగా వానియింటికి రాకపోకలు చేయుచుండెను. చంద్రవర్మయు దనకొమారుఁడు మునుపటివలె నిల్లుపట్టక తిరుగుచుండుటచూచి సందేహపడి, అతని జాడలను కనిపెట్టుటకై దూతలను నియమించి, వారివలనఁ దనపుత్రుఁడు గోపకామినిమీఁద మనసుతగిలియుండుటను దెలిసికొనెను. చంద్రవర్మ వెంటనే తనప్రాణమిత్రుఁడైన బహుమానుని రప్పించి, ఆసంగతియంతయు నతనితోఁ జెప్పి, ప్రమతితండ్రియైన గొల్లవానియింటికి, దనతోఁగూడ రమ్మని కోరెను.

చంద్రవర్మయును బహుమానుఁడును ఇద్దరును మారువేష మును వేసికొని గొల్లవాండ్రు ఇందోత్సవము జరిగించుచున్న సమయమున నావృద్ధగోపకుని మందిరముదగ్గరకు వెళ్ళిరి. వా రిరువురును శ్రోత్రవారేయైనను, ఇంద్రోత్సవ సమయమున వచ్చినవారి నందఱిని ఆదరింతురు కాఁబట్టి, గొల్లవాఁడు వారి కతిథిసత్కారములు చేయుటయే కాక యుత్సవములోఁ బ్రవే శించి తనతోడఁగూడ నానంద మనుభవింపఁ బ్రార్థించెను. ఆనందభరితు లయి యెల్లవారును త్రుళ్ళుచు కేరుచు నుండిరి. కులమువా రందఱును బంతులుసాగి కూరుచుండిరి; ఎక్కడఁ జూచినను ఉత్సవమునకువలయు సంభారములు కూర్పఁబడు చుండెను; చిన్నపిల్లలును పిల్లవాండ్రును గృహముముందఱ నున్న పచ్చికబయలిమీఁద గంతులువేయుచు కేకుచుండిరి. వారికంటె పెద్దవాండ్రు గుమ్మమువద్దకు వచ్చిన మన్నాను వానియొద్ద బొమ్మసామానులను ఇత్తడి నగలను అద్దములను గొనుచుండిరి.

ఈప్రకార మందఱును సందడిగానుండఁగా రామవర్మయు ప్రమతియుఁ అక్కడ నడుచుచున్న వేడుకలయందుఁ బ్రొద్దు పుచ్చుటకంటె నన్యోన్యమును సరససల్లాపములతో కాలక్షే పము చేయుటకయి మిక్కిలి కౌతూహలము కలవా రయి యా సమ్మర్దముపొంతకుఁ బోవక దూరముగా నొక రహస్య స్థలమునఁ గూరుచుండిరి. తన కొమారుడు తన్నెంతమాత్రము

నానవాలుపట్టుటకు వలనుగాకుండ మాఱువేషము వేసికొని యుండుటచే రాజును వారియుపురసంభాషణములు వినఁబడునంత సమీపమునకు వెళ్ళియుండెను. ఆ చిన్నది తనకొమారునితో మాటాడిన వాక్యములు ప్రౌఢములు కాకపోయినను మిక్కిలి మధురములుగా నున్నందున రాజునకుఁగలిగిన యద్భుతమునకుఁ బరిమితిలేదు. అప్పుడు రాజు బహుమానునివంకఁ జూచి "హీనజాతివారిలో నింత సౌందర్యవతిని వినియుఁ గనియుఁ నుండలేదు; నేను కనిపెట్టినంతవఱకు ఈ చిన్నదాని మాటల లోను పతివ్రతలోను హీనజాతియని యూహించుటకుఁ దగిన యాధార మేదియుఁ గనఁబడలేదు." అని చెప్పెను, "నిస్సంశయముగా నీకన్య గోపకులమునకెల్లను రాణియైయుండు" నని బహుమానుఁడు మాఱు పలికెను.

అప్పుడు రాజు ముసలిగొల్లవానికడకు వచ్చి "ఓయీ! నీ కోమార్తెతో మాటలాడుచున్న యీ చిన్నవాఁడెవఁ"డని యడిగెను. "అతనిపేరు కందర్పుఁడు, తనకొమార్తెమీఁద ప్రేమ గలదని చెప్పుచున్నాఁడు; అతనికి నాకూఁతురును వివాహము చేసికొనుయోగముండెనేని ఆతఁడెప్పుడును కలలోనైన నెరుగు చూడని లాభముతోఁడఁగూడ నామెరాఁగలదు" అని, అమ్మఁగా మిగిలిన ప్రమతియొక్క యాభరణములని భావమునం దుంచు కొని వాఁడు పలికెను, ఆగొల్లవాఁడు నాఁడట్లు నగలుకొన్ని విక్రయించి పశువులమందలను కొన్నతరువాత, శేషించిన నగ

వలసినదని యావృద్ధుని నడిగెను. రాజంతట మాఱువేషమును దీసివేసి నిజస్వరూపముతో కొడుకును గద్దించుచు "వివాహ విమోచనమును జూచెద"నని పలుకుచు వెట్టిగొల్లవానియింటఁ బుట్టిన యీ కులహీనురాలిని వివాహము చేసికొన సాహసించి నందులకయి పలువిధముల నిందించి ప్రమతివంకఁజూచి "యిఁక ముందెప్పుడైన . నీవు నాకొమారుని మరల నిక్కడకువచ్చుట కంగీకరించితివేని నిన్నును నీతండ్రియైన ముసలిగొల్లవానిని గూడ క్రూరముగాఁ జంపించెద" నని బెదరించెను. తత్క్షణమే బహుమానునితోఁ దనకొమారుని వెంటఁబెట్టుకొనిరమ్మని చెప్పి, మహాకోపముతో రాజు తాను ముందుగా మందిరమునకుఁ బోయెను.

రాచబిడ్డయొక్క స్వభావము దాఁగియుండదు కాఁబట్టి రాజు వెళ్ళినతరువాత అతని దూషణభాషణముల వలనఁ గోపమువచ్చినదయి ప్రమతి, "మన కందఱకును హాని ప్రాప్తము గానున్నను, నేనిప్పు డేమియు భయపడ లేదు; ఒకటిరెండు మాఱులు రాజును పలుకరించి, ఆయనతో మీ రాజభవనము మీఁద ప్రకాశించునూర్యుఁడే సంకోచపడక మా కుటీరనిల యముమీఁద సహితము ప్రకాశించుచు మిమ్మును మమ్మును సమానదృష్టితోనే చూచుచున్నాఁడని స్పష్టముగా మొగము మీఁదనే యనవలె ననుకొంటి" ననిపలికి, పిమ్మట విచారగ్రస్తురా లయి "యీఁకను నేనేమో కలగనుచున్నానుకాఁబోలు! ఇప్పుడు

మేలుకొన్నాను. ఈ విషయమై యిఁక మనసున కేమియు బాధ కలుగఁజేయను. నన్ను విడిచి మీరు దారినిపొండి; నేను నా మేఁకలపాలు పితుకుకొనుచు నాపాట్లు నేను పడుచుండెదను" అని నిస్పృహతోఁ బలికెను.

దయార్ద్రమానసుఁడైన బహుమానుఁడు ప్రమతియొక్క యనువర్తనమునకు ధైర్యమునకును మెచ్చుపుట్టి, మోహాంధకార నిమగ్నుఁడై యున్న రాజనందనుఁడు జనకుని యాజ్ఞామాత్రమునఁ బ్రాణసమానయైన యామానినిని విడువఁగలవాఁడు కాఁడని రూఢిగా నెఱిఁగినవాఁడు కాన, ఏలాగుననైన నా కాముకీకాముకుల నేకీభవింపఁజేయు మార్గమును వెదకియుండుటవలనఁ జిరకాలమునుండి తనమనసులోనున్న యొక యాలోచనను ఈడేరుచుకొనవలెనని నిశ్చయించెను. సింహళద్వీపాధినాథుఁ డగు సుమిత్రుఁడు నిజముగాఁ బశ్చాత్తప్తుఁడయి యున్నాఁ డన్నసంగతి బహుమానుఁడు చిరకాలముక్రిందనే యెఱిఁగియుండెను. ఇప్పుడు బహుమానుఁడు చంద్రవర్మకు ప్రియమిత్రుఁడుగా నుండినను, తన పూర్వప్రభువును జన్మభూమిని మఱియొకసారి పోయిచూడవలెనను నాశనుమాత్రము బొత్తిగా వదలిపెట్టినవాఁడుకాఁడు. కాబట్టి రామవర్మను ప్రమతిని తనతోఁడ సింహళద్వీపమునకు రావలసినదనియు, అచ్చట సుమిత్రుని మధ్యవర్తిత్వమునఁ జంద్రవర్మవలన క్షమాపణమును వడసి వివాహమున కనుమతిని పొందువఱకును మిమ్ముఁ గాపాడుట కారాజు నొడఁబఱిచెద ననియుఁ జెప్పెను.

ఈ యాలోచనకు వారిద్దఱును సంతోషముతో నంగీక రించినందున బహుమానుఁడే ప్రయాణమునకుఁ గావలసిన సర్వ సామగ్రిని సిద్ధము చేసి యావృద్ధగోపకునిగూడఁ దమతో వచ్చుట కొడఁబఱిచెను. ఆ గోపవృద్ధు ప్రమతియొక్క మిగిలియున్న యాభరణములను, ఆమెచిన్ననాఁటి బట్టలను, ఆ బట్టల కంటిం చియున్న కాగితమునుగూడ దనతోఁ గొనిపోయెను. కొన్నాళ్లు సముద్రముమీఁద సుఖయాత్ర చేసినతరువాత, వారందఱును క్షేమముగా సుమిత్రుని రాజధానికివచ్చి చేరిరి. పోయిన భార్యను కొమార్తెను దలఁచుకొని మనోవ్యాధితోఁ బరితపించు చున్న సుమిత్రుఁడు బహుమానుని నత్యంతప్రేమతోఁ నాద రించి, పరమప్రమోదముతో రామవర్మకును అతిధిసత్కారము నెఱపి గారవించెను. బహుమానుఁడు తీసికొనిపోయి రామవర్మ యొక్క కాఁబోవురాణియని కనఁబఱచిన ప్రమతిమీఁదనే రాజు దృష్టియంతయు నుండెను. ఆమెయందుఁ దన పోయిన భార్యయొక్కపోలిక కనఁబడినందున, ఆయన కప్పుడు క్రొత్తగా దుఃఖము లోపలినుండి బయలుదేఱి "నేనట్లు కఠినచిత్తుఁడనై చంపింపకుంటినేని, నాకూఁతురు నిటువంటి చక్కనికన్నియయే యగునుగదా" యని కంటఁ దడిపెట్టెను. ఆ వెనుక రాజు రామవర్మవంకఁ దిరిగి "ఉత్తముఁడైన నీతండ్రియొక్క చెలిమిని నిష్కారణముగాఁ బోఁగొట్టుకొంటిని; ప్రాణాధికుఁడైన యాతని నేలాగుననైన నొకసారి చూడవలెనని నాకెంతో యభిలాష

మున్నది" అని పలికెను. ఆ చిన్నదానిని రాజంత శ్రద్ధతోఁ జూచుటయు తనకూఁతు రెప్పుడో చిన్నతనములోఁ దనయాజ్ఞ చేతనే యడవులలో విడిచిపెట్టఁబడిన దని చెప్పుటయు విచారించి యాగొల్లవాఁడు చిన్నదానిని విడిచిపెట్టిరన్న గాలమున విధమును, ఆమె గొప్పవంశమందుఁ బుట్టినదాటకు సాక్ష్యమిచ్చు తనకుదొరకిన యమూల్య వస్త్రాభరణములను దలఁచుకొని మనసులోఁ బరిపరివిధములఁ జింతింపసాగెను. ఆసంగతు లన్నిటిని బాగుగ విమర్శించి వాఁడు రాజు పోయినదనుకొనుచున్న కూఁతురే యీ ప్రమతియని నిశ్చయము చేసికొనెను.

అప్పుడు రామవర్మయు, ప్రమతియు, బహుమానుఁడును, మిత్రవిందయు, అందఱును గూరుచుండియుండఁగా ఆ ముసలి గొల్లవాఁడు తనకు ప్రమతిదొరకిన విధమును, ఆమెనుగొని వచ్చి విడిచినమనుష్యుని పెద్దపులిపట్టుకొనఁగా దాను జూచుటయుఁ జెప్పి, ఆసమయమున బ్రమతికిఁ గట్టఁబడిన విలువవస్త్రమును మెడయందున్న కంఠాభరణమును బట్టకుఁగట్టియున్న కాగితమును గొనివచ్చి రాజుముందఱఁ బెట్టెను. వానిని జూచిన తోడనే మిత్రవింద యావస్త్రమును నగయు మంజువాణి తన కూఁతున కలంకరించినవే యనియు, ఆ కాగితముమీఁదివ్రాత తన మగనియక్షరములే యనియు, ఆనవాలుపట్టెను. అప్పు డక్కడనున్నవారి కందఱికిని సందేహము నివర్తియయి, ఆమె సుమిత్రుని పుత్రికయాట విస్పష్టమాయెను. పోయినదనుకొను

చున్న కూఁతురు దొరకినది కాఁబట్టి దేవతావాక్యప్రకారము రాజుయొక్కవంశము భూమిమీఁద నిలిచినదన్న సంతోషమును, భర్తపోయినాఁడన్న దుఃఖమును, మిత్రవిందను గొంతతడవు నిశ్చేష్టురాలినిగాఁ జేసెను. ప్రమతి తనకొమార్తెయే యయిన సంగతి తెలిసినతోడనే తనబిడ్డను చూచుకొనుటకుఁ దల్లికి ఋణములేకపోయెఁగదాయని దుఃఖించి, యేమో చెప్పదలఁచుకొని "నీతల్లి నీతల్లి—" అనుమాటలు దక్క మఱియేమియుఁ బలుకలేక కొంతతడవు నివ్వెఱగొంది యుండెను.

రాజు ప్రకారము సంతోషములోను, దుఃఖములోను మునిఁగియుండఁగా మిత్రవింద సమీపమునకు వచ్చి సుప్రసిద్ధుఁడగు నొక శిల్పకారునిచే క్రొత్తగాచేయించిన మంజువాణి యొక్క విగ్రహ మొకటి తనయింట నున్నదనియు, దానిపని యేలినవారు మాగృహమునకు వచ్చి చిత్తగింతురేని నిజముగా మంజువాణియే యక్కడ నున్నదనుకొనునంత విచిత్రముగా నున్నదనియు రాజుతో మనవిచేసెను. రాజు తనభార్యయొక్క రూపమును జూడవలెనని యత్యాసక్తుఁడయి యున్నందునను, ప్రమతి తానెప్పుడును జూచియెఱుఁగని తల్లియాకార మేప్రకారముగా నుండునో కనవలెనని యతికుతూహలయయి యున్నందునను, అందఱును గలిసి యక్కడకు వెళ్ళిరి. ఆ వింతయైన విగ్రహమున కడ్డముగానున్న తెరనుదీసి మిత్రవింద చూపఁగానే, అచ్చముగా విగ్రహము మంజువాణిని బోలియున్నందున రాజు

నకు దుఃఖమూగక మనసులోనుండి పొరలిపొరలి రాసాగెను. కాఁబట్టి కొంతసే పాతఁడు మాటాడుటకును కదలుటకును శక్తుఁడుగాక చిత్రప్రతిమవలె నిలువఁబడి యుండెను.

మిత్రవింద యప్పుడు రాజున కభిముఖురాలయి "మహా ప్రభూ! మీరు నిశ్చేష్టులయి యుండుట చూడఁ బనివాని శిల్పకళాకౌశల్యమున కత్యద్భుత పడుచున్నట్లు కనుపట్టు చున్నారుగాన నేను మిక్కిలి ప్రమోదించుచున్నాను. ఈ విగ్రహము కేవలము శ్రీ రాజ్ఞిగారివలె నుండలేదా?" అని యడిగెను. రాజును తుదకు హృదయము పదిలపఱచుకొని, "నిస్సందేహముగా నేను మొట్టమొదట నామెను వరించినప్పు డేప్రకారముగా నున్నదో యిప్పుడు నదేప్రకారము గంభీర ముగా నిలుచున్నది. కాని మంజువాణి నిజముగా నీవిగ్రహము కనుపట్టునంతవయస్సు చెల్లినదికాదు" అని చెప్పెను. "అట్లయి నచో మంజువాణి యిప్పటివఱకును జీవించియుండిన నిప్పు డేరీతి నుండునో యారీతినే విగ్రహమును సిద్ధముచేసిన పనివాని యొక్క నేర్పును మనము మఱింత మెచ్చుకోవలసియున్నది. దేవరవారు చూడఁ జూడఁగా విగ్రహము కదలుచున్నదని కూడ భ్రమంతురేమో యని భయమగుచున్నది. ఇఁక తెర వేయనిండు" అని మిత్రవింద మరల బలికెను. "తెర వేయఁ బోకు బహుమానుఁడా! చూడు—నీకది శ్వాసము విడుచు చున్నట్లు కనఁబడలేదా? దాని కనురెప్పయందు చలన

మున్నట్టుకూడఁ గనుపట్టుచున్నది” అని రాజు బహుమానునకు జూపెను. ఇంతలో మిత్రవింద “దేవరవారి కిప్పుడు గలిగిన సంతోషమునుబట్టి విచారింపఁగా అది జీవించియున్నదని సహితము తలంతురు. ఇప్పుడు నేను తెరవేయవలెను” అనెను. రాజు “మిత్రవిందా! ఇరువది సంవత్సరము లయినను నన్నాలాగుననే తలఁచునట్లు చేయుము. ఇప్పుడును ఆ దివ్యసుందర విగ్రహమునుండి యూపిరి వచ్చుచున్నట్లే నాకుఁ గనఁబడుచున్నది. ఎంతవింతయులియైనను విగ్రహమున కూపిరివచ్చునట్లు చెక్కఁగలుగునా? దానిని పోయి యొక్కసారి ముద్దుపెట్టుకొనెదను; మీరెవ్వరును బరిహసింపకుఁడు” అని మోహపరవశుఁడయి పలికెను. “దేవా! తాళుఁడు. ఆమె పెదవికివేసిన యెఱ్ఱరంగింకను పచ్చిగానే యున్నది; మీరు ముద్దుపెట్టుకొందురేని మీపెదవి కంటుకొనును. నేను తెర దిగవేయుదునా?” అని మిత్రవింద యడిగెను. “వద్దువద్దు” ఇరువదియేండ్లయినను ఆలాగుననే యుండనిమ్మ”ని రాజు వేఁడుకొనెను.

ఈ సంభాషణము నడుచుచున్నంతతడవును మోఁకాలిమీఁద నిలువఁబడి నోరు కదలింపక సావధానముగాఁ జననియొక్క నిరుపమానమైన విగ్రహమువంకనే చూచుచున్న పద్మమతి “నా ప్రియమాతవంకఁ జూచుచు, ఎంతకాలమయినను నీప్రకారముగా నిలుచుండఁగల”నని పలికెను. అంతట మిత్రవింద రాజువంకఁ జూచి నిగిడించి, ‘యీ యాలోకనసౌఖ్య

మును గొంతసేపు మఱచి తెరయైనను వేయ ననుజ్ఞయిండు; లేదా యింతకంటె నద్భుతము నొకదానిని జేసెద నందుకైన సమ్మతింపుఁడు. నిశ్చయముగానే నేనీ విగ్రహమును కదలునట్లు చేయఁగలను; అంతియేకాదు — దేవరవారి సెలవయ్యెనేని, పీఠమునుండి దిగివచ్చి మీహస్తము పట్టుకొనునట్లుసహితము చేయఁగలను. కాని నేనాలాగునఁ జేసినపక్షమున, నేనేదో క్షుద్రదేవతయొక్క యుపాసనవలనఁ జేయుచున్నా నని మీరు తలంతురు—కాదని నేను ప్రమాణము చేయఁగలను" అని చెప్పెను. ఆమాటలకు రాజు విస్మయపడి, "నీవామెచేత నేమి చేయింపగలవో దానినంతను జేయింపుము; కన్నులపండువుగాఁ జూచెదను. విగ్రహము చలించునట్లు చేయుదానికి మాటాడునట్లుకూడ జేయుట కష్టముకాదు; కాఁబట్టి ఆమెచేత నీవేమి పలికించినను గూఁడఁ గర్ణరసాయనముగా వినఁగల" నని పలికెను.

ఈ పనికొఱ కావఱకే మిత్రవింద సిద్ధముచేసి యుంచిన వాద్యములును సంగీతములును మంగళధ్వనులతో మ్రోగ సాగెను. చూచువారందఱును అద్భుత రసాక్రాంతు లగునట్లుగా విగ్రహమప్పుడు పీఠమునుండి దిగివచ్చి, చేతులతో సుమిత్రుని కంఠమును కౌఁగిలించుకొని, భర్తకును కూఁతురుకును శుభములు ప్రసాదించుటకయి భగవంతునిఁ బ్రార్థించుచు, మాటాడ సాఁగెను. ఆ విగ్రహమట్లు సుమిత్రుని నాలింగనము చేసికొని

వల్లభుని పుత్రికను దీవించినందున కంత యాశ్చర్యపడవలసిన పని లేదు-నిజముగా ఆ విగ్రహము జీవించియున్న రాణియే.

వెనుకటి యాపత్సమయమున రాణి ప్రాణములను గాపాడుటకు మఱియొక యుపాయము తోఁచనందున, మిత్రవింద యప్పుడు రాణి కాలముచేసినదని రాజుతో గొప్ప యసత్యమును జెప్పెను. నేఁడు ప్రమతి దొరికినదన్న శుభవార్తను వినువఱకును తాను జీవించియున్నట్టు రాజునకుఁ దెలియుట యిష్టము లేనిదై, మంజువాణి యప్పటినుండియు యోగ్యురాలయిన మిత్రవిందతోఁ గలిసి యన్యు లెఱుఁగకుండ నామె యింటనె తలదాఁచుకొని యుండెను. ఆమె రాజు తనవిషయమునఁ జేసిన యాపదలను నాఁడే మఱచిపోయినను, నోరులేని పసిపిల్లవిషయ మయి చేసిన క్రూరకృత్యములనుమాత్రము మఱచిపోఁగలిగినది కాదు.

పోయినదనుకొన్న భార్య జీవించుటయు, చిన్ననాఁడే యెడఁబాసినకూఁతురు గృహము చేరుటయు, విలోకించి దీర్ఘకాలము విచారములపాలయి యున్న యా రాజప్పుడు పొందిన యానందమునకు మితము లేదు. ఏమూలఁ జూచినను సంతోషవాక్యములును మంగళతూర్యములును దప్ప మఱియేమియు వినఁబడ లేదు. సంతుష్టాంతరంగులైన యాదంపతులు హీనజాతినాతిగా నెన్నఁబడినపుడు సహితము తమకూఁతును వరించినందుకయి రామవర్మను ఆమెను వాత్సల్యముతో బెంచి పెద్దదానిని

జేసినందునకయి గొల్లవానిని బహువిధముల గొనియాడిరి. తాము చేసిన ప్రయత్నములన్నియుఁ దుద కనుకూలముగా ఫలించినందున బహుమానుఁడును మిత్రవిందయు నమందానందము నొందిరి. ఎవ్వరును ప్రతీక్షింపని యీసంతోషములో నేదియు లోపము లేకుండఁ జేయుటకో యనఁ జంద్రవర్మసహిత మప్పుడు వచ్చి రాజమందిరమును జొచ్చెను. అతఁడు మొట్ట మొదటఁ గొడుకును బహుమానుఁడును గనఁబడకపోయి నప్పుడు అవజ్ఞకే బహుమానుఁడు స్వదేశమునకుఁ బోవఁగోరి యున్న సంగతి నెఱిఁగినవాఁడుగాన వారిరువురును సింహళ ద్వీపములో దొరకుదురని యూహచేసి, సాధ్యమయినంత శీఘ్రముగా బయలుదేఱి, సుమిత్రుని జీవితకాలములో నెల్లను మిక్కిలి సుదినమయిన యీ సంతోషసమయముననే యచ్చట నుట్టిపడెను.

చంద్రవర్మ వారితోఁగూడ సంతోషము ననుభవించు టయేకాక, అక్రమముగాఁ దనమీఁద జారత్వశంకను మోపిన సుమిత్రుని యపరాధమును మన్నించి బాల్యములో నాతనితో నెంతమైత్రి గలిగియుండెనో యిప్పుడును మరల నంతమైత్రి గలవాఁడాయెను; చంద్రవర్మ ప్రమతిని తన కొడుకునకుఁ జేసికొననని నిరాకరించునన్న భయమిప్పు డేమియు లేదు. ఇప్పుడామె కులహీనురాలయిన గొల్లపడుచుగాక, సింహళ ద్వీప రాజ్యమున కుత్తరాధికారిణియైన రాజయువతియాయెను.

గాఁబట్టి ప్రమతికిని రామవర్మకును మహావైభవముతో వివాహ మహోత్సవము జరిగెను. చిరకాలము కష్టపరంపర ననుభ వించిన సుకృతాత్ము రా లయిన మంజువాణియొక్క శ్రమ యంతయు నాఁటితో నివారణ మయినందున ఆమె పుత్రిక తోను బెనిమిటితోను గలిసి సకల సంపదలతోను దులఁ దూగుచు బహుకాలము సమస్త సౌఖ్యముల ననుభవింపు చుండెను.

సంపూర్ణము.

కీ॥ శే॥ రావు బహదూర్

కందుకూరి వీరేశలింగం పంతులుగారి

* గ్రంథములు *

"స్వీయ చరిత్ర" రెండుభాగములు ఒకేవాల్యూం		రు 8—00
"రాజశేఖర చరిత్ర"	ఆఫ్ కాలికో	రు 2—75
,,	సాదా	రు 2—00
,,	సంక్షిప్తప్రతి	రు 1—00
"అభిజ్ఞాన శాకుంతలము"		రు 1-50

వాల్యూములు తాలూకు విడిగ్రంధములుకూడ మావద్ద దొరుకును.

గౌరవ కార్యదర్శి,

హితకారిణీ సమాజము, (రిజిష్టర్డు).

రాజమహేంద్రవరము.

అవంతీ ప్రెస్, రాజమండ్రి